సాక్షి నంద్యాల

శనివారం । 24 । మే । 2025



కోవిడ్‌ను ఎదుర్కొందాం

కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. 10లో▸



మైనార్టీ కాలేజీకి మోక్షమెన్నడో?

ఆదోని డివిజన్‌లో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్నారు. పాఠశాల స్థాయిలో ఉర్దూ మీడియంలో చదివిన విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ చేసేందుకు ప్రభుత్వ ఉర్దూ కళాశాలలు లేవు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,589.40
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:10.628
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:6,782
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:2,082

న్యూస్‌రీల్

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైల గ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాలమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న పది సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలోని 35 పరీక్ష కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన భౌతిక శాస్త్రం పరీక్షకు 632 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 2,657 మంది విద్యార్థులకు గాను 2025 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయి. ఓపెన్ టెన్త్ పరీక్షల్లో భాగంగా సాంకేతిక విజ్ఞానం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షకు నాలుగు కేంద్రాల్లో 214 మంది విద్యార్థులకు గాను 188 మంది హాజరు కాగా 269 మంది గైర్హాజరయ్యారు. అదే విధంగా ఇంటర్మీడియెట్ పరీక్షల్లో భాగంగా గణితం, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం పరీక్షలు రెండు కేంద్రాల్లో 115 మంది విద్యార్థులకు గాను 105 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు.

కోడుమూరుకు చేరిన జీడీపీ నీరు



నీటితో కళకళలాడుతున్న హంద్రీనది

కోడుమూరు రూరల్: పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు గాజులదిన్నె ప్రాజెక్టు నీరు శుక్రవారం కోడుమూరు వద్ద హంద్రీకి చేరుకున్నాయి. హంద్రీ పరీవాహక ప్రాంతాల్లో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి జీడీపీ ఎడమ కాల్వ ద్వారా 40క్యూసెక్కుల చొప్పున వర్కూరు సుద్దవాగు మీదుగా గత మూడు రోజుల నుంచి కోడుమూరు హంద్రీనదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. మరో నాలుగైదు రోజులు నీరు వదిలితే పూర్తిస్థాయిలో మంచి నీటి పథకాలకు చేరుకుంటాయని కోడుమూరు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రసాద్ తెలిపారు.

బెధరగొడుతున్నారు!

- అన్నదాతకు రాయితీ బోటు
- 'ఫాం మెకనైజేషన్' పేరుతో వాత
- అధిక ధరలకు యంత్ర పరికరాలు
- కొనుగోలుకు ఆసక్తి చూపని రైతులు

ఆళ్లగడ్డ: వ్యవసాయంలో రైతులకు చేదోడుగా ఉండేందుకు సబ్సిడీపై యంత్రపరికాలు అందజేస్తున్నామని కూటమి ప్రజా ప్రతినిధులు ఊదరగొడుతున్నా.. 'ఫాం మెకనైజేషన్' (వ్యవసాయ యాంత్రీకరణ) పథకానికి మాత్రం అనుకున్నంత స్పందన లేదు. ఎమ్మెల్యేల సిఫారస్ లెటర్, బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే రాయితీపై ఇస్తున్న పరికరాల ధరలు ఎక్కువగా ఉండటంతో రాయితీ రూ. లక్షలో ఉందని చెబుతున్నా 'ఆ పరికరాలు.. మాకొద్దు!' అంటున్నారు. ఫలితంగా లక్ష్యాలను చేరుకోవడానికి వ్యవసాయశాఖాధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ 'ఫాం మెకనైజేషన్' పథకం లక్ష్యం నెరవేరేతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాకు 1,635 యూనిట్లు కేటాయించగా సబ్సిడీ కింద రూ 2.85 కోట్లు మంజూరు చేయడం జరిగింది. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం బరిస్తుంది. ఇప్పటివరకు 1,004 దరఖాస్తులు అందాయి. నాన్ సబ్సిడీ చెల్లించిన రైతులు 446 మంది. 550 మంది రైతులు యూనియట్లు మంజూరైనా సబ్సిడీ చెల్లించి పరికరాలు తీసుకెళ్లేందుకు ఆసక్తి కనబరచడం లేదు. ఫలితంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను చేరుకునేందుకు జిల్లా, మండల స్థాయి అధికారలు క్షేత్రస్థాయి సిబ్బందితో రోజువారీ సమీక్షలు జరుపుతూ రైతులను సంబంధిత యంత్ర పరికరాల సరఫరా చేసే కంపెనీల దగ్గరకు తీసుకెళ్తున్నారు. అయితే అక్కడ యంత్ర పరికరాల రేట్లు చూసి రైతుల కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. రాయితీ పరికరాలు తీసుకునేందుకు రైతులు పోటీపడి ముందుకు వస్తారనుకుంటే పరిస్థితి భిన్నంగా ఉందని మండల వ్యవసాయాధికారులు చర్చించుకోవడం గమనార్హం. దీంతో కేటాయించిన యూనిట్ల కంటే దరఖాస్తుల సంఖ్య తక్కువగా ఉండటమే కారణం. దీనికి తోడు మంజూరైన యూనిట్లను సైతం అనేక మంది తీసుకుపోయేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఆసక్తి ఉన్న రైతులకు అధికారపార్టీ నేతల 'టీడీపీ ట్యాక్స్'అడ్డంకిగా మారింది. సామాన్య రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకుల నుంచి తగిన సహకారం అందక పోవడం అవరోధంగా మారింది.

బహిరంగ మార్కెట్‌లో ఎమార్పీకే...

పేరుకే 50 శాతం రాయితీ అని ప్రకటించినప్పటికీ వ్యవసాయ శాఖ సీలింగ్ నిర్ణయించడంతో అన్ని పరికరాలపై 50 శాతం రాయితీ అందడం లేదు. పైగా బహిరంగ మార్కెట్ కంటే అత్యధిక ధర నిర్ణయించడంతో రైతుకు వాస్తంగా దక్కే ఆర్థిక ప్రయోజనం నామమాత్రంగా ఉంటోంది. మరి కొన్ని పరికరాలైతే కేవలం సబ్సిడీ ధరకే బయట మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఫలితంగా అన్నదాతకు అనుకున్న మేరకు లబ్ధి చేకూరడం లేదు. సాధారణంగా ఒక్క పరికరాన్ని కొనుగోలు చేసే రైతు బాగా బేరమాడితే ధర తగ్గిస్తారు. అలాంటిది వేల సంఖ్యలో పరికరాలు కొనుగోలు చేస్తున్నప్పుడు ధర ఇంకా తగ్గాల్సి ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. బహింగ మార్కెట్ కంటే అత్యధిక ధర కోడ్ చేయడం వెనుకు మతలబు ఏంటా అని రైతులు చర్చించుకుంటున్నారు.



ఆళ్లగడ్డలో సబ్సిడీ తక్కువ ఉండటంతో రైతులు తీసుకోని రొటోవేటర్లు

➤ ఉయ్యాలవాడ మండలంలో ఓ గ్రామానికి చెందిన రైతు 42 పళ్ల రొటోవేటర్ కావాలని వ్యవసాయాధికారులను సంప్రదిస్తే ధర రూ. 1,52 లక్షలు అని, ప్రభుత్వ రాయితీ రూ. 50 వేలు పోను రూ. 1.02 లక్షలు అవుతుందని చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో అదే పరికరం రూ. 1.10 లక్షలకే ఇవ్వడంతో పాటు ఐదేళ్ల గ్యారెంటీ. అయినా రూ. 5 వేలైనా మిగులుతాయి కదా అని దరఖాస్తు చేసుకునేందుకు వెళితే ఎమ్మెల్యే లెటర్ కావాలని చెప్పారు. గ్రామ నాయకుడి ద్వారా ప్రయత్నిస్తే లెటర్‌కు రూ. 10 వేలు (10 శాతం) ఇవ్వాలని చెప్పడంతో వారి కళ్లు బైర్లుకమ్మాయి.



➤ మండల కేంద్రం చాగలమర్రిలో టీడీపీ పార్టీకి చెందిన ఓ రైతు వ్యవసాయ యాంత్రికరణ పథకం కింద ఇచ్చే సబ్సిడీపై పవర్ స్ప్రేయర్ కొనుగోలు చేయాలని భావించాడు. రూ. 26,010 నగదు చెల్లించి వస్తువు తీసుకోవాలని, అనంతరం ప్రభుత్వ సబ్సిడీ రూ. 10 వేలు బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తుందని, రైతు వాటా రూ. 16,010 అవుతుందని తెలిసింది. అయితే ప్రొద్దుటూరులో అదే పవర్ స్ప్రేయర్ ధర రూ. 16,500 లభిస్తుందని తెలుసుకుని అక్కడే కొనుగోలు చేశాడు.

..ఇది ఈ ఇద్దరు కొనుగోలు చేయాలనుకున్న రెండు యంత్ర పరికరాల పరిస్థితే కాదు. కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ యంత్ర పరికరాల రేట్లన్నీ ఇదే విధంగా ఉండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్‌లో నచ్చిన మంచి కంపెనీలకు చెందిన పరికరాలను కొనుగోలు చేయొచ్చని భావిస్తున్నారు.



రుద్రవరం మండలం ఆలమూరులో రైతుకు అందజేస్తున్న గొర్రు

పథకం : ఫాం మెకనైజేషన్
లక్ష్యం : యాంత్రీకరణ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం
జిల్లాకు కేటాయించిన యూనిట్లు : 1,635
కేటాయించిన సబ్సిడీ మొత్తం : రూ. 2.85 కోట్లు
వచ్చిన దరఖాస్తులు : 1,004
నాన్ సబ్సిడీ చెల్లించిన రైతులు : 486
పేమెంట్ పెండింగ్ : 56
నాన్ సబ్సిడీ చెల్లించేందుకు ముందుకు రాని రైతులు : 550
మిగిలిన యూనిట్లు : 1,149

పంచుకున్న 'పచ్చ' తమ్ముళ్లు

ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణపై టీడీపీ నేతల కన్నుపడింది. సన్న, చిన్నకారు రైతులకు రాయితీపై అందజేయాల్సిన పరికరాలను అధికారపార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, నోరున్న కార్యకర్తలు గద్దల్లా తన్నుకు పోయారు. గుట్టుచప్పుడు కాకుండా తలా ఒకటి చొప్పున పంచేసుకున్నారు. ఎమ్మెల్యేలైతే ఈ బాధ్యతను పూర్తిగా పార్టీ నేతలకు అప్పగించి గుట్టుచప్పుడు కాకుండా లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని చక్కబెట్టేశారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు వారిచ్చిన జాబితా ఆధారంగానే పరికరాలను పంపిణీ ఏర్పాట్లు చేశారు. గత ఐదేళ్లు వ్యవసాయాధికారులే లబ్ధిదారులను ఎంపిక చేసేవారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కార్యక్రమం పూర్తిగా నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయింది. కొసమెరుపు ఏంటంటే ? పంచుకోవడంలో నేతల మధ్య కీచులాటలు లేకుండా తలా ఒకటి అధికారులే దగ్గరుండి పంచివ్వడం. అయితే దరఖాస్తు చేసుకున్న సామాన్య రైతులు వీటి కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే ఏం సమాధానం చెప్పాలో తెలియక ఆ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల నుంచి వారికి వచ్చే సబ్సిడీని బట్టి టీడీపీ నేతలు కమీషన్ మాట్లాడుకున్నారు. ఒక్కో దానికి కనిష్టంగా 10 శాతం కమీషన్ చెల్లించేలా ఒప్పందాలు జరిగినట్లు తెలుస్తోంది.

'పీఎంశ్రీ' పనులు వేగవంతం చేయండి

- కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద జిల్లాలో 40 పాఠశాలల్లో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణాలపై ఎంఈఓలు, ప్రధాన ఉపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత కింద 28 పాఠశాలలు, రెండో విడత కింద 12 పాఠశాలల్లో రసాయన ప్రయోగశాల, ప్లే గ్రౌండ్స్, లైబ్రరీ, ఆర్‌ఓ ప్లాంట్లు, కిచెన్ గార్డెన్స్ తదితర 144 పనులు మంజూరయ్యాయన్నారు. మొదటి విడతలో 28 పాఠశాలల్లో ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణాలను తనిఖీ చేసి నాణ్యతను పరిశీలించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులు జూన్ 6వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. కిచెన్ గార్డెన్స్‌కు సంబంధించి ఫెన్సింగ్ పూర్తయిందని విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కూడా స్కూల్ కమిటీ వారిని సమన్వయం చేసుకుంటూ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ ప్రేమాంత్ కుమార్, డీఈఓ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల జీవితాలతో చెలగాటం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

- ఇంటింటికీ రేషన్ పంపిణీ నిలిపివేత దారుణం



ఎండీయూ వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్ల జీవితాలతో చెలగాటమాడుతుందని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటమద్దులు, మహమ్మద్ గౌస్, సీపీఎం పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్‌లు విమర్శించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని సీపీఎం కార్యాలయం నుంచి ఎండీయూ వాహనాలతో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌ఓ రామునాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఖాజా శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసేందుకు ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎండీయూ వాహనాలకు కాల పరిమితి ఉన్నా జూన్ 1వ తేదీ నుంచి ఎండీయూ ఆపరేటర్లను తొలగిస్తున్నామని చెప్పడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో ఎండీయూ ఆపరేటర్లు 9,260 మంది ఉన్నారని, కూటమి ప్రభుత్వం కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు.

నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఎండీయూ వాహనాలను కొనసాగించాలని, లేని పక్షంలో ఎండీయూ వాహన ఆపరేటర్లతో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ నేతలు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవస్థలను నాశనం చేస్తుందని వారు విమర్శించారు. ఇప్పటికే 3 లక్షల మంది వలంటీర్లను, మద్యం దుకాణంలో పని చేసే 30వేల మందికి పైగా ఉద్యోగులను ఇంటికే సాగనంపిందన్నారు. అధికారంలోకి రాగానే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కూటమి నేతలను ఉన్న ఉద్యోగాలను తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికులను, ప్రజలను మోసగించడం తప్ప కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేక పోతుందన్నారు. సీఐటీయూ నాయకులు, ఎండీయూ ఆపరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సర్వం మార్చి.. మంగళం పాడి

- తెలుగు మాధ్యమానికి చంద్రబాబు సర్కారు మంగళం
- నాడు ప్రేమ ఒలకబోసి.. నేడు జీఓ తెచ్చి
- బడుల్లో తెలుగు మీడియం లేదంటూ ఉత్తర్వులిచ్చిన పాఠశాల విద్యాశాఖ
- ఇప్పటికే ఇంటర్‌లో తెలుగు సబ్జెక్టును ఆప్షనల్ చేసిన వైనం
- మండిపడుతున్న భాషాభిమానులు



నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ బడులలో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్ పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలుగు మాధ్యమానికి తూట్లు పొడుస్తోందని గత ఐదేళ్లగా అక్కసు వెళ్లగక్కిన కూటమి నాయకులు తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు మాధ్యమానికి మంగళం పాడేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేదంటూ విద్యాశాఖ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొనడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు కలిపి 1,490 ఉండగా అందులో 1,50,155 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంటర్మీడియెట్‌లో సైతం ఇన్నాళ్లు తప్పనిసరిగా ఉన్న తెలుగు సబ్జెక్టును ఐచ్ఛికం చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడి తెలుగు అధ్యాపకులంతా ఆందోళన చెందుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్న రోజుల్లో తెలుగు మాధ్యమానికి అన్యాయం చేస్తున్నారని, తెలుగులోనే బోధన, చదువులు కొనసాగాలని గగ్గోలు పెట్టిన కూటమి పార్టీల పెద్దలు, నాయకులు తీరా అధికారంలోకి వచ్చాక తమ స్వరం మార్చుకుంటున్నారు. తాజాగా పాఠశాల విద్యాశాఖ తెలుగుమాధ్యమం లేదంటూ ఉత్తర్వులు ఇవ్వడం పట్ల తెలుగుభాషాభిమానులు, ఏపీ రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లాశాఖ ప్రతినిధులు మండిపడుతున్నారు.

నాడు తెలుగుకు అన్యాయం జరగకుండా...

తెలుగు సబ్జెక్టుకు అన్యాయం జరగకుండా.. తెలుగును సబ్జెక్టును తప్పనిసరి చేస్తూనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంగ్లిషు మీడియంను తీసుకోచ్చింది. పేద, మధ్య తరగతి పిల్లలు పోటీ ప్రపంచంతో పోటీపడి రాణించాలని ఆనాడు ఇంగ్లిషు మీడియంలో చదువు, సీబీఎస్‌ఈ సిలబస్ అమలు విషయంలో ఎవరెన్ని చెప్పినా ఆనాటి గత సర్కారు వెనక్కి తగ్గలేదు. జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం ఐఐటీ, ఎంబీబీఎస్ వంటి కోర్సులను కూడా తెలుగు మాధ్యమంలో బోధించాలని పేర్కొంటే ప్రస్తుతం రాష్ట్రంలో మాత్రం పాఠశాలల్లో ఆ నిబంధనలను ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

పునర్వ్యవస్థీకరణలో తీవ్ర అన్యాయం..

పాఠశాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 1 నుంచి 8 తరగతులు ఉండే ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు బోధించే ఉపాధ్యాయుల పోస్టులను తీసేయడం తీవ్ర అన్యాయమని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ప్రతినిధులు మండిపడుతున్నారు. 8వ తరగతి తర్వాత రాబోయే పదో తరగతిలో తెలుగు ఉత్తీర్ణత ప్రభావితం కానుందని గుర్తుచేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి పార్టీ నాయకులు మాటలు, ప్రకటనలు విని నిలువునా మోస పోయామని తెలుగు భాషాభిమానులు, తెలుగు ఉపాధ్యాయులు, లెక్చరర్లు తమ ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.

దురుద్దేశం తేటతెల్లం..

ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు టీచర్లు ఉండరా..? అంటే అవుననే సమాధానం పాఠశాల విద్యాశాఖ చెబుతోంది. ఈ మేరకు పునర్వ్యవస్థీకరణ జీవోలో ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు బోధకులు పాఠశాలలకు కేటాయించకుండా మార్గదర్శకాలను వెలువరించింది. 2001లో విస్తతంగా ప్రాథమికోన్నత పాఠశాలలు నెలకొల్పినప్పుడు ఏర్పాటైన స్టాఫ్ ప్యాటర్న్‌ను 2025 వరకు కొనసాగించడం ద్వారా మెరుగైన విద్యా ప్రమాణాలు సాధ్యమయ్యాయి. తాజాగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు పోస్టులను ఎత్తివేయడం వారి దురుద్దేశాన్ని తేటతెల్లం చేస్తోంది. ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల తెలుగు బోధనను ఎవరు చేపడతారో ప్రశ్నార్థకంగా మారిందని భాషాభిమానులు, రాష్ట్ర భాషోపాధ్యా సంస్థ జిల్లాశాఖ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే..

- తెలుగుభాష పట్ల గౌరవం ఉంటే తక్షణం పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి.
- విద్యార్థుల రేషియో ఆధారంగా బడుల్లో తెలుగు ఉపాధ్యాయులను నియమించాలి.
- తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ఉన్నత చదువులు చదవడానికి, ఉద్యోగాలు పొందేందుకు 2 శాతం రిజర్వేషన్ కల్పించాలి.
- ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ కళాశాల స్థాయి వరకు తెలుగు మాధ్యమంలో విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలి.


తీవ్ర అన్యాయం



రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో తెలుగు మాధ్యమానికి పాతరేసేలా కూటమి ప్రభుత్వం దుందుడుకు చర్యలు చేపడుతోంది. విద్యాశాఖ తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వ బడుల్లో తెలుగు మాధ్యమం లేదంటూ పేర్కొనడం విచారకరం. కూటమి ప్రభుత్వం ఆనాడు చేసిన ప్రకటనలకు ప్రస్తుతం పూర్తి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం తగదు.

– కన్నయ్య, రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు, నంద్యాల

తెలుగుకు వెలుగేదీ?



నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి పార్టీల పెద్దలు, నాయకులు, అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంగ్లిషుమీడియం, సీబీఎస్‌ఈ సిలబస్ పట్ల అనరాని మాటలు అన్నారు. ఆ వాఖ్యలు, ప్రకటనలను ఒకసారి గుర్తుచేసుకోవాలి. తీరా అధికారంలోకి వచ్చాక తెలుగు మాధ్యమాన్ని అధఃపాతాళానికి తొక్కేయాలని చూస్తున్నారు. ఇది ఎంత మాత్రం సరికాదు. ప్రభుత్వం తక్షణమే పునరాలోచన చేయాలి.

– హుసేన్‌మియా, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా ప్రధానకార్యదర్శి, నంద్యాల

మృత్యువు మింగేసింది!

- పొలంలోని నీటి తొట్టిలో మునిగి ఇద్దరు బాలికలు మృతి



మంజుల (ఫైల్)



మాధురి (ఫైల్)

గోనెగండ్ల: పొలంలో నీటి తొట్టిలో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఇద్దరు బాలికలు ప్రమాదవశాత్తూ మృత్యువాత పడ్డారు. ఈ విషాద సంఘటన గోనెగండ్లలో శుక్రవారం చోటు చేసు కుంది. స్థానిక కురువ పేటకు చెందిన బోయ మందకల్, సరస్వతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గ్రామంలోనే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి రెండవ కూతురు మాధురి(12) ఆరవ తరగతి వరకు చదివి మధ్యలో బడి మానేసింది. అలాగే ఆదే కాలనీకి చెందిన బోయ రంగప్ప నాయుడు, మహేశ్వరి దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరి రెండో కుమార్తె మంజుల (12) కూడా బడి మానేసింది. రోజు మాదిరిగా సరస్వతి, మహేశ్వరి శుక్రవారం ఓ రైతు పొలంలో పత్తి విత్తనాలు విత్తేందుకు వెళ్తుండగా వారి బిడ్డలు మాధురి, మంజుల కూడా వెంట వెళ్లారు. తల్లులు పొలంలో పత్తి విత్తనాలు విత్తుతుండగా మధ్యాహ్న సమయంలో ఆ చిన్నారులు ఇద్దరు పొలంలోని నీటి తొట్టి దగ్గరకు వెళ్లారు. సరదాగా ఈత కొట్టేందుకు అందులోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి పోయారు. కొద్ది సేపటి తర్వాత పిల్లలు కనిపించక పోవడంతో అనుమానంతో నీటి తొట్టిలో చూడగా ఇద్దరు విగతజీవులుగా కనిపించడంతో గుండెలు బాదుకున్నారు. కుమార్తెల మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

27లోగా బదిలీల దరఖాస్తులు జెడ్పీకి పంపాలి

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 27లోగా జిల్లా పరిషత్‌కు పంపాలని జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఒకేచోట 5 సంవత్సరాల సర్వీసు పూర్తయిన ఉద్యోగుల బదిలీలను చేపడుతున్నట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను కూడా ఆయా కార్యాలయాల అధిపతులకు పంపించామన్నారు. 27వ తేది తరువాత వచ్చిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమన్నారు.

వ్యవసాయ శాఖలో 65 మంది బదిలీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖలో 65 మంది ఏఈవోలు, మినిస్టీరియల్ సిబ్బంది బదిలీ అయ్యారు. కూటమి పార్టీల నేతల సిఫారసులకు అనుగుణంగా బదిలీల ప్రక్రియను నిర్వహించారు. ఏఈవోలు, జూనియర్ అసిస్టెంట్లు దాదాపుగా ప్రతి ఒక్కరూ సిఫారసు తెచ్చుకోవడం గమనార్హం. కొంతమందికి కోరుకున్న చోటుకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఏఈఓల్లో 38 మంది, జూనియర్ అసిస్టెంట్లు 13 మంది బదిలీ అయ్యారు. 14 మంది ఆఫీసు సబార్డినేట్లు, డ్రైవర్లకు స్థానచలనం కలిగింది. ఉమ్మడి జిల్లాను యూనిట్‌గా తీసుకొని బదిలీలు చేపట్టారు. కర్నూలు, నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారులు పీఎల్ వరలక్ష్మి, మురళీకృష్ణ సంయుక్తంగా బదిలీలు నిర్వహించారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం అక్రమ రవాణా జరిగితే వేటు



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

ఆలూరు: ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో కర్ణాటక మద్యం రవాణా, అమ్మకాలు జరిగితే వేటు తప్పదని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బందిని ఆ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఆలూరు ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ శ్రీదేవి సమక్షంలో అధికార సిబ్బందితో ఆయన ప్రత్యేకంగా సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు గ్రామాల్లో అక్రమ మద్యం రవాణాను అడ్డుకోవాల్సిన బాధ్యత ఎక్సైజ్ సిబ్బందిపై ఉందన్నారు. ప్రధానంగా చెక్‌పోస్టులో సీసీ కెమెరాలు నిరంతం పనిచేసేలా చూడాలన్నారు. వాహనాల తనిఖీ చేపడుతూ, అడ్డ రహదారులపై నిఘా వేసి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మద్యం షాపులలో ఎంఆర్‌పీ కంటే అధిక రేట్లకు విక్రయిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. హాలహర్వి మండలం క్షేత్రగుడి ఎక్సైజ్ చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఆయన వెంట జిల్లా అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణ, డీటీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్, ఆలూరు ఎక్సైజ్ సీఐ లలితాదేవి, ఎస్ఐ నవీన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మహా 'నందీశ్వరుడి'కి నేడు ప్రదోషకాల అభిషేకం

మహానంది: మహానందిలో శనివారం బహుళ త్రయోదశి, మహా ప్రదోష కాలం సందర్భంగా నందీశ్వరుడు జన్మించిన మహానంది క్షేత్రంలో సాయంత్రం 4–00 గంటల నుంచి ప్రదోష కాల నందీశ్వర అభిషేకం జరుగనుంది. ప్రదోష కాల నందీశ్వర అభిషేక సేవలో పాల్గొనాల్సిన వారు, మధ్యాహ్నం 3–30కి ఆర్జిత సేవా టికెట్ తీసుకుని ఆలయంలో ఉండాలని వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని విజ్ఞప్తి చేశారు.

డీసీసీబీ సీఈఓగా రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారిగా పి.రామాంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్, డీసీసీబీ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి నవ్య ఫైల్‌పై సంతకం చేసినట్లు సమాచారం. ఇంతవరకు సీఈఓగా ఉన్న విజయ్‌కుమార్ ఆప్కాబ్‌కు వెళ్లనున్నారు. విజయ్‌కుమార్ ఆప్కాబ్‌లో డీజీఎం. డిప్యూటేషన్‌పై డీసీసీబీలో ప్రత్యేక అధికారిగా పనిచేస్తున్నారు. సీఈఓ పోస్టు ఖాళీ కావడంతో గత ఏడాది జనవరి నుంచి పూర్తి బాధ్యతలతో కొనసాగుతున్నారు. ఈయన ఆప్కాబ్‌కు వెళ్లనుండటంతో ఆ స్థానంలో జనరల్ మేనేజర్ అయిన రామాంజనేయులు నియమితులైనట్లు సమాచారం. ఈయన 20 నెలల క్రితం వరకు సీఈఓగా దాదాపు ఎనిమిదేళ్లు పని చేశారు. మళ్లీ పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండటంతో గుర్తించి డిబార్ చేశారు. మొత్తం 7112 మంది విద్యార్థులకు గాను 6414 మంది పరీక్షలకు హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు శుక్రవారం వెల్లడించారు.

మైనార్టీ జూనియర్ కళాశాలకు మోక్షమెప్పుడో?

- ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల
- ఉర్దూ మీడియం విద్యార్థుల ఎదురుచూపులు

ఉర్దూ మీడియం విద్యార్థులు ప్రాథమిక విద్యను అభ్యసించేందుకు స్థానికంగా అవకాశాలు ఉన్నాయి. అయితే ఇంటర్మీడియెట్, డిగ్రీ చదవాలంటే స్థానికంగా కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిందే. దీంతో చాలా మంది చదువును మధ్యలోనే మానేస్తున్నారు. దీన్ని గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదోనిలో మైనార్టీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల (ఉర్దూ మీడియం) ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. రూ.1.60 కోట్ల నిధులు కేటాయించి కళాశాల భవనం నిర్మించింది. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కళాశాల ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్నా కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఉర్దూ కళాశాల ఎప్పుడు ప్రారంభమవుతుందోనని విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ పరిధిలో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్నారు. ఆదోని పట్టణంలోనే దాదాపు 30 నుంచి 40 శాతం మంది ముస్లింలు ఉన్నారు. పట్టణంలోనే దాదాపు 500 మంది పైచిలుకు విద్యార్థులు ఉర్దూ మీడియంలో చదువుకొంటున్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉర్దూ మీడియంలో చదువుకోవడానికి అవకాశాలు ఉన్నాయి. అయితే ఉన్నత చదువులు ఇంటర్మీడియెట్, డిగ్రీ వంటి కోర్సులను చదువుకోవడానికి ఉర్దూ మీడియం కలిగిన ప్రభుత్వ కళాశాలలు అందుబాటులో లేవు. ఉర్దూ మీడియంలో ఉన్నత చదువులను చదువుకోవాలంటే కర్నూలు లేదా అనంతపురం, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. చాలామంది దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇది గమనించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థుల చదవు మధ్యలో ఆగిపోకూడదని, ఉర్దూ మీడియంలోనూ ఉన్నత చదువులు చదువుకోవాలనే ఉద్దేశంతో నిధులను కేటాయించి మైనార్టీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ. 1.60 కోట్లతో నాలుగు తరగతి గదులు, ఒక ప్రిన్సిపాల్ గది, ఒక ప్రయోగశాల గదిని నిర్మించారు. గదులతో పాటు టాయిలెట్స్, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు వంటి మౌలిక వసతులను కూడా కల్పించారు. గదుల నిర్మాణం పూర్తయ్యింది గానీ కళాశాల ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియని పరిస్థితి.



నిర్మాణం పూర్తయిన మైనార్టీ ఉర్దూ జూనియర్ కళాశాల భవనం

కళాశాల కోసం ఎదురు చూపులు

మైనార్టీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎప్పుడు ప్రారంభమవుతుందోనని ఉర్దూ మీడియంలో చదువుకున్న విద్యార్థినులు ఎదురుచూపులు చూస్తున్నారు. అకాడమిక్ సంవత్సరం ప్రారంభమవుతోంది. జూన్‌లో కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆయా కళాశాలల్లో అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయి. ఇంతవరకు ప్రభుత్వ మైనార్టీ కళాశాల ప్రారంభమవుతుందో లేదో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులు తీసుకొని మైనార్టీ ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఉర్దు మీడియం)ను ప్రారంభించాలి. కళాశాలను ప్రారంభిస్తే ఎంతో మంది విద్యార్థినులు చదువుకోవడానికి అవకాశం కల్పించిన వారవుతారు.

దూర ప్రాంతాలకు వెళ్లాల్సిందే



ఉర్దూ మీడియంలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించాలంటే కర్నూలు, అనంతపురం, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. గ్రామీణ ప్రాంతాల్లో 1 నుంచి 5వ తరగతి వరకు, పట్టణ ప్రాంతాల్లో 1 నుంచి 10వ తరగతి వరకు ఉర్దూ మీడియంలో చదువుకోవడానికి పాఠశాలలు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్మీడియెట్, డిగ్రీ చదువుకునేందుకు ఇక్కడి ప్రాంతంలో అవకాశాలు లేవు. దీంతో చాలా మంది చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. అధికారులు స్పందించి కళాశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఫయాజ్ అహ్మద్ నిజాం, కౌన్సిలర్, ఆదోని

కళాశాలను ప్రారంభించాలి



మైనార్టీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణం పూర్తయ్యింది. కానీ ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. కళాశాల ప్రారంభమైతే అందులో చేరాలని ఎంతోమంది విద్యార్థినులు ఎదురు చూస్తున్నారు. అసలు ఈ విద్యా సంవత్సరంలో కళాశాల ప్రారంభమవుతుందో లేదో తెలియని పరిస్థితి. ఇప్పటికైన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కళాశాలను ప్రారంభించాలి.

– గౌస్, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి



కొమ్మ కొమ్మకు గూడు

మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద సుంకులాపరమేశ్వరి ఆలయం వద్ద తుమ్మచెట్టుపై కొంగల గూళ్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. చెట్టుకు ఆకులు లేకున్నా చూడచక్కగా పేర్చినట్లు కొమ్మకొమ్మకు గూళ్లను కొంగలు ఏర్పాటు చేసుకున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో గూళ్ల వద్ద కొంగల సందడిని బాటసారులు వీక్షించి పరవశం చెందుతున్నారు. ఇలా నాలుగు తుమ్మ చెట్లపై కొంగలు తమ ఆవాసాలను ఏర్పాటు చేసుకున్నాయి. – పాణ్యం

తిరోగమనంలో డీసీసీబీ

- నిరర్థక ఆస్తులు రూ.195 కోట్ల నుంచి రూ.265 కోట్లకు పెరిగిన వైనం

కర్నూలు(అగ్రికల్చర్): గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో లాభాల బాట పట్టిన ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తిరోగమనంలోకి పయనిస్తోంది. శుక్రవారం జాయింట్ కలెక్టర్, డీసీసీబీ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీ నవ్య అధ్యక్షతన బోర్డు సమావేశం జేసీ చాంబరులో నిర్వహించారు. సమావేశంలో సీఈవో విజయకుమార్, జీఎం పి.రామాంజనేయులు, డీసీవో ఎస్.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. 2024–25 ఆడిట్ రిపోర్టులను జేసీ ఆమోదించారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన డీసీసీబీ వైఎస్ఆర్‌సీపీ పాలనలో, అంటే 2022 నుంచి లాభాల బాట పట్టింది. లోనింగ్ పెంచడం, రికవరీలు పెరగడం వల్ల నిరర్థక ఆస్తులు తగ్గించుకొని నికర లాభాల్లోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత డీసీసీబీ పరిస్థితి తారుమారైంది. 2024–25లో లోనింగ్ పూర్తిగా పడిపోయింది. 2024 ఏప్రిల్ నెలలో డీసీసీబీ టర్నోవర్ రూ.3,930 కోట్లు ఉండగా.. నేడు కూడా టోర్నోవర్ అలాగే ఉంది. నిరర్థక ఆస్తులు మాత్రం భారీగా పెరిగిపోయాయి. 2024 ఏప్రిల్ నెలలో నిరర్థక ఆస్తులు రూ.195 కోట్లు ఉండగా.. నేడు రూ.265 కోట్లకు చేరుకోవడం గమనార్హం. డీసీసీబీకి 2022–23లో రూ.10 కోట్ల ఆదాయం రాగా రూ.4 కోట్లు పీఏసీఎస్‌లకు డివిడెండు రూపంలో పంపిణీ చేశారు. 2023–24లో రూ.4.50 కోట్ల లాభం వచ్చింది. 2024–25లో అతి కష్టం మీద డీసీసీబీకి రూ.1.20 కోట్ల ఆదాయం వచ్చినట్లు స్పష్టమైంది.

అసాంఘిక కార్యకలాపాలపై 'స్పెషల్' దాడులు





నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ, పాల్గొన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు

కర్నూలు: క్షేత్రస్థాయిలో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే స్పెషల్ టీమ్‌లను రంగంలోకి దింపి దాడులు చేయిస్తానని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఎస్పీ శుక్రవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని సబ్ డివిజన్లలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి పరిష్కారానికి సూచనలు చేశారు. స్టేషన్ల వారీగా కేసుల పెండింగ్‌కు కారణాలను అడిగి తెలుసుకున్నారు. డాబాల్లో మద్యం అనుమతించకుండా గట్టి చర్యలు చేపట్టాలని.. ఓపెన్ డ్రింకింగ్, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. గ్రామాల పర్యటనకు వెళ్లినప్పుడు రోడ్డు ప్రమాదాల మలుపులు, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించాలన్నారు. రేడియం స్టిక్కర్స్, బారికేడ్స్, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. గత నెలలో నమోదైన కేసులను ఛేదించడంలో ప్రతిభ కనపరచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఎస్పీలు బాబుప్రసాద్, ఉపేంద్ర బాబు, హేమలత, భాస్కర్ రావు, సీఐలు, ఎస్ఐలు సమావేశంలో పాల్గొన్నారు.

పేడ ఎరువుకు భలే గిరాకీ

- ట్రాక్టర్ ఎరువు ధర రూ.7 వేలు

కోడుమూరు రూరల్: పశువుల పేడ ఎరువుకు భారీగా డిమాండ్ నెలకొంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు భూములను ఎరువులు, ఇతర పోషకాలతో సారవంతం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు చాలామంది రైతులు పేడ ఎరువుపైనే ఆధారపడుతున్నారు. అయితే గ్రామాల్లో రైతుల అవసరాలకు తగినట్లుగా ప్రస్తుతం పేడ ఎరువు లభించని పరిస్థితి. పశుపోషణ భారమవడం, మేత దొరక్క చాలామంది రైతులు పశువుల పెంపకానికి స్వస్తి పలుకుతుండడంతో పేడ ఎరువుకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ట్రాక్టర్ పేడ ఎరువు రూ.6,500 నుంచి రూ.7వేలు పలుకుతోంది. ఒక ఎకరాకు 3 నుంచి 4 ట్రాక్టర్ల పేడ ఎరువు అవసరమవుతోంది. దీంతో స్థానికంగా పేడ ఎరువు లభించక చాలామంది రైతులు సుదూర ప్రాంతాల్లో ఉన్న పశువుల పెంపకందారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.



ట్రాక్టర్‌లో పేడ ఎరువును నింపుతున్న కూలీలు

చిన్న సినిమాలను ఆదరించండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సినీ హీరో వీర్రాజు (చరణ్)

ఆదోని టౌన్: చిన్న సినిమాలను ఆదరించాలని సినీ హీరో వీర్రాజు (చరణ్) విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ద్వారకా సినీ థియేటర్‌లో వీర్రాజు 1971 సినిమా రిలీజై ప్రేక్షకులను ఆకట్టుకున్న సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సమావేశంలో పలు సినీ హీరోల అభిమాన సంఘాల నాయకులు, ప్రేక్షకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ హీరో వీర్రాజు మాట్లాడుతూ.. భారీ పెట్టుబడితో తీసే పెద్ద హీరోల సినిమాల మాదిరిగానే తక్కువ ఖర్చుతో తీస్తున్న చిన్న సినిమాలను పాఠకులు ఆదరించాలన్నారు. ద్వారకా థియేటర్‌లో శుక్రవారం వీర్రాజు సినిమా రిలీజైన సందర్భంగా పట్టణ ప్రముఖులు థియేటర్‌కు వెళ్లి సినిమాను వీక్షించారు. సినీ హీరో ఆదోని వాసి కావడం సంతోషకరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆధార్ అప్‌డేట్.. సర్వర్ బిజీ!

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

హాలహర్వి: ఆధార్ సేవల కోసం వెళితే సర్వర్ బిజీ కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ప్రస్తుతం బాపురం గ్రామంలో మాత్రమే ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ–కేవైసీ, కొత్త రేషన్‌కార్డుల కోసం చిన్నారుల అప్‌డేట్, పెద్దవారు అప్‌డేట్ కోసం ఆధార్ కార్డు ప్రతిఒక్కరికీ తప్పనిసరి అయ్యింది. చిన్నారులకు కొత్త ఆధార్ కార్డు కోసం ఎదురు చూస్తున్నారు. ఇదిలాఉండగా బాపురం గ్రామంలో మాత్రమే ఆధార్ అప్‌డేట్ సెంటర్ ఉండడంతో ప్రజలు భారీగా తరలివస్తున్నారు. అక్కడ సర్వర్ బిజీ వల్ల పనులు జరగడం లేదు. ఒక ఆపరేటర్ మాత్రమే ఆధార్ అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో గంటల కొద్దీ ప్రజలు కార్యాలయం వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మండల కేంద్రమైన హాలహర్వి, గూళ్యం, చింతకుంట లాంటి పెద్ద పంచాయతీల్లో కూడా ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఆధార్ అప్‌డేట్ సెంటర్‌లో సర్వర్ బిజీ కావడంతో పిల్లలతో కలిసి వేచి ఉన్న ప్రజలు

మాదకద్రవ్యాలను అరికడదాం

- జూన్ 1 నుంచి 26వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(అర్బన్): జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్ అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 13–19 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలు మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు అధ్యయనాల్లో తేలినందుకు పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృత చేయాలన్నారు. సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రయీస్ ఫాతిమా, లీగల్ సెల్ అడ్వకేట్ హేమలత, మెప్మా పీడీ నాగశివలీల, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీఈఓ శామ్యూల్ పాల్, డీఎస్పీ బాబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమాలు ఇలా..

- ➡ జూన్ 1 నుంచి 7వ తేదీ వరకు విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.
- ➡ జూన్ 8 నుంచి 14వ తేదీ వరకు వాల్ పెయింటింగ్స్, పోస్టర్లు వేయించాలన్నారు.
- ➡ జూన్ 15 నుంచి 21వ తేదీ వరకు చర్చలు, కాంపిటీషన్స్, సెమినార్లు, వెబినార్లతో అవగాహన కల్పించాలన్నారు.
- ➡ 22 నుంచి 26వ తేదీ వరకు అవగాహన ర్యాలీలు సంతకాల సేకరణ, బైక్ ర్యాలీలు చేపట్టాలన్నారు.
- ➡ 26న ప్రతి కార్యాలయంలో మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలన్నారు.

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్తలు

కర్నూలు(హాస్పిటల్): కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. ఆయన శుక్రవారం తన చాంబర్‌లో కోవిడ్ వైరస్‌పై హెచ్‌ఓడీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోవిడ్ వైరస్‌ను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన ప్రొటోకాల్ గురించి చర్చించామన్నారు. కోవిడ్ కేసుల దృష్ట్యా ఆసుపత్రిలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైరస్ పట్ల వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పల్మనాలజీ, అనస్తీషియా, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, ఎమర్జెన్సీ మెడిసిన్, మైక్రో బయాలజీ ఫ్యాకల్టీతో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు రెడీ చేసుకోవాలని సంబంధిత హెచ్‌ఓడీలను ఆదేశించారు. పీపీఈ కిట్‌లకు సంబంధించి తగినంత స్టాక్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మాస్క్, పీపీఈ కిట్స్, యాంటీవైరల్ డ్రగ్స్, అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండేలా సర్జికల్ అండ్ మెడికల్ స్టోర్‌లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆక్సిజన్ పోర్ట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అనస్తీషియా వైద్యులకు చెప్పారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, గతంలో మాదిరిగానే స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం, భౌతిక దూరం పాటించడం, జనసమూహాలకు దూరంగా ఉండటం, కోవిడ్ వైరస్ సోకితే క్వారంటైన్‌లో ఉండటం చేయాలన్నారు. ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, వైద్యులు ఇక్బాల్ హుసేన్, విశాల, నాగలక్ష్మి, విజయలక్ష్మి, సుబ్రహ్మణ్యం, శారద, అడ్మినిస్ట్రేటర్ శివబాల నాగాంజన్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



కోవిడ్ ముందస్తు జాగ్రత్త చర్యలపై చర్చిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

మహానందీశ్వరుడి సేవలో ప్రముఖులు



ఆలయ ప్రాంగణంలో న్యాయమూర్తి లక్ష్మీరాజ్యం దంపతులు

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో శుక్రవారం పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్, ఐజీ, ఐపీఎస్ రాహుల్‌దేవ్ శర్మ, ఈఎస్ రవికుమార్, కర్నూలు కోర్టు 7వ అదనపు జిల్లా జడ్జి వి.లక్ష్మీరాజ్యం, రామశర్మ దంపతులు, సీఐ కృష్ణమూర్తి, నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వేద పండితులు, అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.


బీసీ భవన్ స్థల పరిశీలన



బీసీ భవన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ

కర్నూలు(అర్బన్): నగరంలోని బీ క్యాంప్ పరిసరాల్లో బీసీ భవన్‌కు కేటాయించిన స్థలాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ పరిశీలించారు. శుక్రవారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు కర్నూలుకు వచ్చిన ఆయన్ను స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో పలువురు బీసీ నాయకులు కలిసి నిర్మాణ దశలో ఆగిపోయిన బీసీ భవన్‌ను పరిశీలించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే ఆయన బీసీ భవన్ స్థలాన్ని పరిశీలించి, భవనం పూర్తి చేసే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ నేపథ్యంలో నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌కు హాస్టల్ మంజూరు చేయాలని, ఉమ్మడి జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని బీసీ నాయకులు కోరారు. అలాగే బీసీ కులాలకు చెందిన వివిధ కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేయాలని, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారిణి కే.ప్రసూన, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.జాకీర్‌హుసేన్, సహాయ బీసీ సంక్షేమాధికారి శ్రీనివాసులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, నాయకులు ఉప్పరి శివన్న, పీజీ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రియల్ ఎస్టేట్ రంగానికి ప్రోత్సాహం



క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల మైదానంలో క్రెడాయ్ ప్రాపర్టీ ప్రదర్శన నిర్వహించారు. మంత్రి భరత్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. ఓర్వకల్లులో పెద్దఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, అక్కడ స్టార్ హోటళ్లను ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కర్నూలు పరిసర ప్రాంత ప్రజలు ఈ ప్రదర్శనను వినియోగించుకోవాలన్నారు. క్రెడాయ్ అధ్యక్షుడు, కన్వీనర్, చైర్మన్ సురేష్‌కుమార్ రెడ్డి శ్రీనివాసరావు, గోరంట్ల రమణ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, ఇళ్లు, ప్లాట్లు, నిర్మాణ సంస్థలు, ఇంటీరియర్స్, బిల్డింగ్ మెటీరియల్స్, బ్యాంకింగ్ సంస్థలను ఈ ప్రదర్శనలో ఉంచామన్నారు. ఇంటి కొనుగోళ్లకు రుణసౌకర్యం అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం మంత్రి స్టాళ్లను సందర్శించారు. నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, క్రెడాయ్ సంస్థ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, కోశాధికారి టీఏవీ ప్రకాష్, రాగమయూరి బిల్డర్స్ అధినేత కేజే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.